క్లుప్తంగా

పింఛన్ల పంపిణీని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఆత్మకూరురూరల్ : కొత్తగా మంజూరు చేసిన వాటితో సహా ఆత్మకూరు మండలానికి మంజూరైన 4,950 సామాజిక పింఛన్లను తొలిరోజే అర్హులందరికీ పంపిణీ చేసి విజయవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సంక్షేమ సహాయకులకు ఆయన మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ వలంటీర్లు, సంక్షేమ సహాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుని పింఛన్ల పంపిణీని వేగవంతం చేయాలన్నారు.

విద్యార్థులకు అభినందనలు



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆత్మకూరురూరల్ : ఇటీవల గణతంత్ర దినోత్సవం సందర్భంగా కరటంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు వివిధ రంగాల్లో చూపిన ప్రతిభకు గాను కలెక్టర్ చక్రధర్ బాబు నుంచి అవార్డులు అందుకున్నారు. ఈ నేపథ్యంలో వారిని మంగళవారం పాఠశాలలో హెచ్ఎం తోట శ్రీనివాసులు, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. దీంతో పాటు టౌన్ హాలులో నిర్వహించిన కళాచిత్రాల పోటీల్లో ఈ పాఠశాల నుంచి 54 మంది విద్యార్థులు పాల్గొనగా వీరిలో ఏడుగురు బంగారు పతకాలు సాధించారు. వీరిని కూడా ఉపాధ్యాయుడు పెంచలరెడ్డి తదితరుల ఆధ్వర్యంలో అభినందించారు.

వాహనాల తనిఖీ

చేజర్ల : మండల కేంద్రమైన చేజర్లలో ఆత్మకూరు బ్రేక్ ఇన్‌స్పెక్టర్ రాములు, సిబ్బంది పలు వాహనాలను మంగళవారం తనిఖీ చేశారు. నాలుగు ఇసుక ట్రాక్టర్లకు చలానాలు విధించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

యంత్ర సామగ్రి పరిశీలన

ఉదయగిరి : పట్టణంలోని దిలావర్‌భాయి వీధిలో ఉన్న చెక్కనగిషీ కేంద్రానికి కొత్తగా మంజూరైన యంత్ర సామగ్రిని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ చక్రధర్‌బాబు సూచనలతో మైనారిటీ సంక్షేమ శాఖ యంత్రాల కొనుగోలుకు రూ.10 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఆ నిధులతో కేంద్ర నిర్వాహకులు కొనుగోలు చేసి ఏర్పాటు చేసిన యంత్రాలను పరిశీలించి నివేదికలు పంపాలని కలెక్టర్ సూచించడంతో పరిశీలించినట్లు వెల్లడించారు. ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి, జూనియర్ సహాయకుడు సమ్మద్ ఉన్నారు.

భీమేశ్వరునికి కుంభాభిషేకం

సంగం : మండలంలోని వంగల్లు గ్రామంలో ఉన్న భీమేశ్వరస్వామి ఆలయంలో గత రెండు రోజులుగా జరుగుతున్న కంభాభిషేక మహోత్సవాలు మంగళవారం కొనసాగాయి. ముందుగా ఆలయంలో అర్చకులు 121 రుద్రాలతో స్వామి వారికి ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం చండీహోమం గావించి పూర్ణాహుతి చేపట్టారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మర్యాదపూర్వకంగా..



జెడ్పీటీసీ సభ్యుడిని సన్మానిస్తున్న ఎస్సై

సోమశిల : అనంతసాగరం మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్, జెడ్పీటీసీ సభ్యుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డిని మంగళవారం సోమశిల ఎస్సై భోజ్యానాయక్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బారెడ్డిని శాలువాతో సత్కరించారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలి

ఉదయగిరి : ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సులభరీతిలో బోధన చేస్తూ విద్యార్థుల్లో నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించాలని ఎంఈఓ షేక్.మస్తాన్‌వలీ పేర్కొన్నారు. మండలంలోని గంగిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠనా శక్తిని పెంపొందించేందుకు నాణ్యతతో కూడిన బోధన చేయాలన్నారు. అనంతరం జగనన్న గోరుముద్ద పథకాన్ని పరిశీలించి సూచనలు అందించారు.

డ్రిప్ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి

మర్రిపాడు : రాష్ట్ర ప్రభుత్వం డ్రిప్ పరికరాలను అందజేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని ఈర్లపాడు, మర్రిపాడు గ్రామాల్లో డ్రిప్ పరికరాలను మంగళవారం ఆయన పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం బిందు, తుంపర్ల సేద్యానికి 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలను అందచేస్తోందని వివరించారు. సిబ్బంది బాలాజీ, సుధాకర్, ఉపేంద్ర పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మహిళలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి : రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నట్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కావలి రూరల్ మండలంలోని అన్నగారిపాళెం పంచాయతీ, ఒట్టూరు గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంగళవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ అన్నివర్గాలకు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. జగనన్న పాలనలో తామంతా చాలా సంతోషంగా ఉన్నామని ప్రజలు ఎంతో సంతోషంగా చెబుతున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ప్రతి పల్లెను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వల్ల తీరప్రాంత గ్రామాల యువకులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. అంతే కాకుండా రామాయపట్నం పోర్టు, దామవారం విమానాశ్రయం వంటి భారీ ప్రాజెక్టులతో కావలి కనకపట్నం కానుందని, అది జగనన్న ప్రభుత్వం వల్లే సాధ్యమన్నారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్ట్రా సౌండ్ స్కానింగ్ సిస్టం ప్రారంభం

కావలి రూరల్ : పట్టణంలోని తొమ్మిదో వార్డు రాజీవ్‌నగర్‌లో ఉన్న డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ సిస్టమ్‌ను మంగళవారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. ప్రభుత్వ వైద్యశాలలు కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. అంతే కాకుండా గర్భిణులకు సురక్షిత కాన్పు చేసేలా అన్ని మౌలిక వసతులు ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేశారని గుర్తుచేశారు.

నేడు రొంపిదొడ్లలో 'గడప గడపకు..'

వరికుంటపాడు : మండలంలోని తూర్పురొంపిదొడ్ల గ్రామంలో బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆంద్రా బాలగురవారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రావిళ్ల నాగేంద్ర, సొసైటీ అధ్యక్షుడు కామేపల్లి వెంకటరత్నం మంగళవారం ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని, గడప గడపకు తిరుగుతారన్నారు.

4న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

ఉదయగిరి : ఉదయగిరి అంగన్‌వాడీ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ కార్యకర్తలు, మూడు ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 4న ఆత్మకూరు, కందుకూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో ఇంటర్వ్యూలు జరుగుతాయని ప్రాజెక్టు అధికారిణి లావణ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంచెరువు సెంటర్‌కు సంబంధించి అభ్యర్థినులు కందుకూరు ఆర్డీఓ కార్యాలయానికి, మర్రిపాడు ఎస్సీ, జి.చెర్లోపల్లి, తిక్కవరం, అప్పసముద్రం ఎస్సీ కేంద్రాల దరఖాస్తుదారులు ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయానికి తమ ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలు, కాల్‌లెటర్స్‌తో హాజరుకావాలన్నారు.

- ఆత్మకూరు : ఆత్మకూరు ఐసీడీఎస్ క్లస్టర్ పరిధిలోని పలు మండలాల అంగన్‌వాడీ కేంద్రంలో ఖాళీల భర్తీ కోసం 4వ తేదీన ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ ఎం.పద్మావతి మంగళవారం తెలిపారు. ఆత్మకూరుతో పాటు అనంతసాగరం, ఏఎస్‌పేట మండలాల్లోని అంగన్‌వాడీ ఖాళీల కోసం ఇప్పటికే పలువురు దరఖాస్తు చేసుకున్నారని, ఇంటర్వ్యూకు వచ్చే అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు.

మధ్యాహ్న భోజనానికి బియ్యం వితరణ

చిట్టగుంట : బోగోలు మండలం, కప్పరాళ్లతిప్ప ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల మధ్యాహ్న భోజనం కోసం 250 కేజీల బియ్యాన్ని హైదరాబాద్‌కు చెందిన కాంద్ర సతీష్ నాయుడు మంగళవారం అందజేశారు. విద్యార్థులకు ఏడాది పొడవునా మధ్యాహ్న భోజనం కోసం దాత వితరణగా అందజేసిన బియ్యాన్ని సతీష్ నాయుడు యువనేస్తం ప్రతినిధులు ప్రిన్సిపల్ విజయలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

సోమశిల : సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని అనంతసాగరం తహసీల్దార్ అన్నదాత వెంకటరమణారావు తెలిపారు. రేవూరు సచివాలయ పరిధిలోని వలంటీర్లకు, సచివాలయ సిబ్బందితో ఎంపీడీఓ మధుసూదన్‌తో కలిసి ఆయన మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి త్వరలో చేపట్టబోయే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆత్మకూరు బుజ్జమ్మ, ఉపసర్పంచ్ పాలపాటి నాగార్జున రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత పార్లపల్లి రవికుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

'గడప గడపకు మన ప్రభుత్వం'పై సమీక్ష

చేజర్ల : మండలంలోని పాతపాడు సచివాలయంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'పై ఎంపీడీఓ విజయలలిత మంగళవారం సమీక్ష నిర్వహించారు. వలంటీర్లు ప్రజా సమస్యలను గుర్తించి అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన

సోమశిల : అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023ని పురస్కరించుకుని అనంతసాగరం, సోమశిల గ్రామాల్లోని ఆర్బీకేల్లో మంగళవారం జిల్లా వనరుల కేంద్రం అధికారి ఓబయ్య, శ్రీనివాస చక్రవర్తి అవగాహన సమావేశం నిర్వహించారు. రసాయన పురుగు మందులతో ఏ పంటలోనూ పురుగులను అరికట్టలేమన్నారు. అనంతరం చిరు ధాన్యాల గురించి వివరించారు. ఏఓ శ్రీధర్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి వెంకటరామయ్య, వ్యవసాయ సహాయకులు యశోధ, మైమూన్, కీర్తన పాల్గొన్నారు.

ప్రజాసేవలో ముందుంటా



శ్రీలక్ష్మికి ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి

- ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి

ఉదయగిరి : నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడంలో ఎల్లప్పుడు ముందుంటానని ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల వింజమూరు మండలం ఏ.కిస్తీపురం పంచాయతీ ఆరవీటిపల్లి గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తుండగా గ్రామస్తులు తల్లిదండ్రులను కోల్పోయిన ఎం.శ్రీలక్ష్మి, హర్షవర్ధన్‌లను ఆదుకోవాలని విన్నవించారు. దీంతో ఆయనతో పాడు నియోజకవర్గ మహిళా నేత శాంతకుమారి స్పందించి అనాథ పిల్లలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ మేరకు శ్రీలక్ష్మి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం రాత్రి స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో చిన్నారిచే కేక్ కట్ చేయించారు. పాప పేరుతో రూ.లక్ష నగదును ఐదేళ్ల పాటు బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌ను, నూతన దుస్తులను బాలికకు అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అనాథ పిల్లలకు అండగా ఉంటానన్నారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అక్కి భాస్కర్‌రెడ్డి, ఉపసర్పంచ్ ముర్తుజా హుస్సేన్, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గడియాల్చి ఎస్దాని, ఎంపీటీసీ సభ్యుడు తిరుపతి, నేతలు యు.శ్రీనివాసులు, ఇ.రమణయ్య, దాదాసాహెబ్ పాల్గొన్నారు.

సాఫీ ప్రయాణానికి హెల్మెట్ ధరించండి

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



హెల్మెట్ ధరించి బైక్ నడుపుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి రూరల్ : సాఫీ ప్రయాణానికై ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ట్రంక్ రోడ్డులో మంగళవారం ఎమ్మెల్యే రామిరెడ్డి పోలీసులతో కలిసి ద్విచక్ర వాహనంపై హెల్మెట్ ధరించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత కొత్తరకం ద్విచక్రవాహనాలపై అధిక స్పీడుతో ప్రయాణాలు సాగించి ప్రమాదాల బారిన పడుతున్నారని, కుటుంబసభ్యులను గుర్తు చేసుకుని వాహనాలు నడపాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ శీనానాయక్, డీఎస్పీ వెంకటరమణ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుందర్‌రావు, సీఐ, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో బాధ్యతగా ఉండాలి

- డీఎల్‌డీఓ రమణయ్య



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ రమణయ్య

ఉదయగిరి : సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరిస్తూ మంచిపేరు తెచ్చుకోవాలని ఆత్మకూరు డీఎల్‌డీఓ టి.రమణయ్య పేర్కొన్నారు. మండలంలోని తిరుమలాపురం, కొండాయపాళెం గ్రామ సచివాలయాలను ఆయన మంగళవారం సందర్శించి, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ఉదయం 10.30 గంటల్లోపు బయోమెట్రిక్ వేసి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సచివాలయ సేవలను ప్రజలకు అందించి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు నూరుశాతం ఇంటి పన్నుల వసూలు చేసేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశాల్లో తిరుమలాపురం సర్పంచ్ కె.కృష్ణ, ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, కార్యదర్శి జి.అమర్‌నాథ్‌రెడ్డి, మండల కో-ఆర్డినేటర్ గాజుల ఇమ్రాన్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన తప్పనిసరి



కలిగిరి : మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ మధు



దుత్తలూరు : ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

కలిగిరి : ప్రతిఒక్కరూ కుష్టు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని పంచాయతీ విస్తరణాధికారి వెలుగోటి మధు తెలిపారు. మండలంలోని వీర్నకొల్లు ప్రాథమిక పాఠశాలలో 'స్పర్శ - కుష్టు వ్యాధి' కార్యక్రమంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి నివారణకు ప్రభుత్వం మందులు అందజేస్తోందన్నారు. అనంతరం కుష్టు వ్యాధి లక్షణాలు, చికిత్స విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ డేగా శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్, హెల్త్ సూపర్‌వైజర్ నరసయ్య, ఏఎన్ఎం అరుణ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిర్మూలనకు సమష్టి కృషిచేయాలి

వరికుంటపాడు : కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్ఓ రాజశేఖరరాజు పేర్కొన్నారు. మండలంలోని రామాపురం గ్రామ పంచాయతీలో ఆయన మంగళవారం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యారోగ్య సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించడంతో పాటు అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమం జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ కుష్టు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం మేరీ స్టెల్లా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దుత్తలూరు : కుష్టువ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని దుత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు అయూబ్‌అప్సర్, వనజ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో కుష్టువ్యాధి అవగాహన వారోత్సవాలను వారు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కుష్టువ్యాధి నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీపీఎంఓ నాగరాజు, సీహెచ్ఓ ఓంకారయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు జగన్‌మోహన్, కరుణకుమారి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

అనుమసముద్రంపేట : ఏఎస్‌పేట మండలంలోని తెల్లపాడు ఎంపీపీ పాఠశాలను ఎంపీడీఓ భాస్కర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. విద్యార్థులు సరైన సమాధానాలు చెప్పడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

అభివృద్ధికి సహకరించండి



జలవనరుల శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్‌కు వివరాలు తెలుపుతున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

- ఇరిగేషన్ శాఖ ముఖ్య కార్యదర్శిని కలిసిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు : ఆత్మకూరు నియోజకవర్గంలో జలవనరుల శాఖ ద్వారా అవసరమైన అభివృద్ధి పనులు మంజూరు చేసి, పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరయ్యేలా సహకరించాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్‌ను కోరారు. నియోజకవర్గంలోని ముఖ్య నేతలతో కలిసి ఆయన అమరావతిలోని ఇరిగేషన్ శాఖ ముఖ్య కార్యదర్శిని మంగళవారం కలిశారు. ఆత్మకూరు, ఉదయగిరి మెట్ట ప్రాంతాలకు సాగు, తాగునీటిని అందించేలా రూపొందుతున్న హైలెవల్ కెనాల్ పనులను వేగవంతం చేయించాలని, దీనికి సంబంధించి రూ.18.95 కోట్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కెనాల్ నిర్మాణానికి సేకరించిన భూములకు నష్టపరిహారం కింద రూ.11.75 కోట్లు మంజూరు చేయించాలన్నారు. ఎంజీఆర్ సంగం బ్యారేజీ ప్రారంభోత్సవం రోజు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రూ.40 కోట్ల నిధులు మంజూరు చేయించాలని, ఇరిగేషన్ శాఖ ద్వారా నిలిచిపోయిన 52 అభివృద్ధి పనులకు రూ.65.75 కోట్లకు శాఖాపరమైన అనుమతులు మంజూరు చేయించాలని కోరారు. కొమ్మలేరు వాగు విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు రూ.9 కోట్లు, ఏఎస్‌పేట మండలంలో ఆయకట్టు భూమికి సంబంధించిన 44ఆర్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణం కోసం రూ.19.63 కోట్లు వెంటనే మంజూరయ్యేలా చూడాలన్నారు. ఎంజీఆర్ సంగం బ్యారేజీ నుంచి నెల్లూరు–వైఎస్సార్ ప్రధాన రహదారిని అనుసంధానించే రోడ్డు నిర్మాణం కోసం రూ.15.05 కోట్లు మంజూరు చేయించాలన్నారు. ఈ పనులకు సంబంధించిన అన్నిపత్రాలను ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ముఖ్య కార్యదర్శికి అందజేశారు.

దేవదాయ శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి కలిశారు. సోమేశ్వర ఆలయ నిర్మాణానికి రూ.1.50 కోట్లు, కోదండ రామాలయానికి రూ.23 లక్షల నిధులను మంజూరు చేయించడం పట్ల సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం మంజూరైన నిధులు సరిపోవని, పూర్తిస్థాయి నిర్మాణానికి రూ.7.70 కోట్లు మంజూరు చేయించాలని కోరారు. ఆయన వెంట ఆత్మకూరు, ఏఎస్‌పేట ఎంపీపీలు కేతా వేణుగోపాల్‌రెడ్డి, బోయిళ్ల పద్మజారెడ్డి, జెడ్పీటీసీలు ప్రసన్నలక్ష్మి, పీర్ల పార్థసారథి, ఎస్సీసెల్ అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, రూరల్ కన్వీనర్ చిట్టమూరు జితేంద్రనాగ్‌రెడ్డి, బొమ్మిరెడ్డి రవి, సానా వేణుగోపాల్‌రెడ్డి, పి.రమేష్‌రెడ్డి, బి.చెంచురెడ్డి, గడ్డం శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసులు నాయుడు, రాజేంద్ర పాల్గొన్నారు.

వార్షిక లక్ష్యాన్ని మించి పనిదినాలు

- అదనంగా మరో 30 లక్షల పనిదినాలు
- డ్వామా పీడీ వెంకట్రావు



నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ, ఏపీడీ

ఆత్మకూరురూరల్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వార్షిక లక్ష్యానికి మించి మరో 30 లక్షల పనిదినాలను నెల్లూరు జిల్లాకు ప్రభుత్వం అదనంగా మంజూరు చేసిందని డ్వామా పీడీ వెంకట్రావు పేర్కొన్నారు. ఆత్మకూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం నియోజకవర్గంలోని అన్ని మండలాల ఉపాధి హామీ సిబ్బంది, అధికారులకు ఆత్మకూరు ఏపీడీ శివనారాయణతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు ఉపాధి హామీ పథకం ద్వారా 85 లక్షల పనిదినాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గతేడాది డిసెంబర్ నెలకే ఆ లక్ష్యం నూరు శాతం పూర్తి చేశామన్నారు. తద్వారా మరో 30 లక్షల పనిదినాలు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఆదేశాల జారీ చేసిందన్నారు. ఈ పథకంలో ప్రతి కూలీకి వంద రోజుల పనిదినాలు కల్పించాలనే చట్టం ఉందని, రోజుకు నాలుగు గంటల పాటు పనిచేస్తే రూ.257 కనీస కూలి గిట్టుబాటు అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ ప్రకారం ఒక కుటుంబంలో భార్యభర్తలు తమ పనిదినాలను సద్వినియోగం చేసుకుంటే వంద రోజుల్లోనే రూ.51,400 సంపాదించుకునే అవకాశం ఉందన్నారు. పనిదినాలు పెంచడం ద్వారా క్షేత్రస్థాయిలో వివిధ అభివృద్ధి పనులు, భవన నిర్మాణాలకు సంబంధించి ఉపాధి హామీ పథకం ద్వారా మెటీరియల్ కాంపోనెంట్ నిధులు అధికంగా మంజూరు అవుతాయన్నారు.

వ్యవసాయానికి తొలి ప్రాధాన్యం

ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ ఉద్యాన రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని డ్వామా పీడీ పేర్కొన్నారు. సమీక్ష సమావేశం అనంతరం ఆయన సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడారు. వ్యవసాయ చెరువుల్లో పూడికతీత, చెరువుకట్టల బలోపేతం, ఊటకుంటల నిర్మాణం, పంట కాలువల పూడికతీత తదితర పనులకు సంబంధించి క్షేత్ర సహాయకులు, మండల స్థాయి సిబ్బంది, రైతుల అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు పంపి ఆయా పనులను చేసుకోవచ్చని తెలిపారు. ఉద్యానవన శాఖకు సంబంధించి మామిడి, జామ, సపోట తదితర పంటలు సాగు చేసుకున్న పొలాల్లో సన్న, చిన్నకారు రైతులు, మూడేళ్లు నిండిన పండ్ల తోటల చుట్టూ కందకాలు తవ్వించుకునేందుకు ఉపాధి పథకంలో వెసులుబాటు ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐదు మండలాలకు చెందిన ఉపాధి హామీ అధికారులు, ఏపీఓలు, ఈసీలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

గిరిజనులకు ప్రభుత్వం తోడ్పాటు



ఆత్మకూరురూరల్ : మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు



అల్లూరు : మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీరామకృష్ణ

ఆత్మకూరురూరల్ : గిరిజనులకు ప్రభుత్వపరంగా తోడ్పాటును అందిస్తామని ఆత్మకూరు ఎంపీడీఓ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ రాజేష్ పేర్కొన్నారు. మండలంలోని రామస్వామిపల్లి ఎస్టీకాలనీలో మంగళవారం జాతీయ పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గిరిజనుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తామని, ప్రభుత్వపరంగా అండగా నిలుస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సంపతి రమణ మాల్యాద్రి, పంచాయతీ కార్యదర్శి కార్తీక్, వీఆర్వో రమణయ్య పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ఉదయగిరి : సమాజంలో ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, ఏఎస్‌డబ్ల్యూఓ ఆదిలక్ష్మి సూచించారు. మండలంలోని కొండాయపాళెం పంచాయతీ, వీరారెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో మంగళవారం ఫీల్డ్ రైట్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈఓ జి.ఓబుల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగూర్‌బీ, ఆర్ఐ విజయభాస్కర్, వీఆర్వో వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పౌరులందరికీ సమాన హక్కులు

అల్లూరు : పౌర హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ శ్రీరామకృష్ణ అన్నారు. మండల పరిధిలోని బోడిసత్రం గ్రామంలో పౌరహక్కులపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం పౌరులందరికీ సమాన హక్కులు కల్పించిందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఫణికుమార్, ఆర్ఐ సుధీర్, పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, నాయకులు ఉస్మాన్‌షరీఫ్, బి.సుధాకర్, షేక్.రసూల్ పాల్గొన్నారు.

లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్ చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయభాస్కర్‌రావు

వరికుంటపాడు : నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంలో అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఎంపీడీఓ విజయభాస్కర్‌రావు, హౌసింగ్ ఏఈ రాజారావు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, డిజిటల్, ఇంజినీరింగ్ సహాయకులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలానికి 1,172 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. సిబ్బంది సమన్వయంతో పనిచేసి లక్ష్యాన్ని నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.